క్లుప్తంగా

నేడు వేటపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: కోడూరు-3 సచివాలయ పరిధిలోని వేటపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాండురంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు

బంటుమిల్లి: పెందుర్రులోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రి పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఇదిలా ఉంటే ఆలయ భూమిలో కల్యాణ మండపం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తుల ఆధ్వర్యంలో పెడన ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరిలకు వినతిపత్రాలు పంపారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం 99 శాతం పూర్తైంది. నగరంలో 18,627 పింఛన్లు ఉండగా 18,441 పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు గూడూరు సీహెచ్‌సీ ప్రారంభోత్సవం



గూడూరు: మండలంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ప్రారంభించనున్నారు. తరకటూరులో రూ.32 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.70 లక్షల వ్యయ అంచనాతో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి గూడూరు తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నాబార్డు నిధులు రూ.4 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



కోనేరుసెంటర్: పెదకరగ్రహారంలో బాబాఫరీద్ మస్తాన్ అవులియా 56వ ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు శుద్ధి స్నానం చేయించారు. 6 గంటల నుంచి భజనలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నసమారాధన జరిగింది. సాయంత్రం ఉరుసుచందల్ (గంధం) జెండా ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఉత్సవంలో బాబాను దర్శించుకుని దట్టీ సమర్పించారు. దర్గా షరీఫ్ భక్త సంఘం అధ్యక్షురాలు సూరపనేని ఝాన్సీలక్ష్మి, కార్యదర్శి శొంతి ఫరీద్ ఇతర సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణం



మోపిదేవి: మండలంలో అంతర్గత రోడ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. కోసూరువారిపాలెం నుంచి ఉత్తరచిరువోలు లంక మీదుగా వెంకటాపురం వరకు రింగ్ బీటీ రోడ్డు పనులు త్వరితగతిన సాగుతున్నాయి. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు 4.1 కిలో మీటర్ల నుంచి 10 కిలో మీటర్ల రోడ్డుకు సుమారు 6 కిలో మీటర్ల వరకు ఎస్ఆర్ గ్రాంటు రూ. 2.50 కోట్లతో శంకుస్థాపన చేసిన సంగతి విదితమే. ఈ రోడ్డుతో కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక, ఉత్తరచిరువోలులంక, టేకుపల్లి, వెంకటాపురం గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి ఆర్థిక సాయం

అవనిగడ్డ: ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడటంతో అవనిగడ్డ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు బొంతుల బాపనమ్మకు శుక్రవారం శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వర్రె బసవరావు, సైకం శ్రీనివాసరావు, యర్రంశెట్టి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు



పెడన 20వ వార్డులో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి జోగి రమేష్



పులిగడ్డ పల్లెపాలెంలో తలుపునకు స్టిక్కర్ అంటిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

- మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే సింహాద్రి
- పెడన, మచిలీపట్నం, అవనిగడ్డలో 'మా నమ్మకం నువ్వే జగన్'

పెడన: ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువ కావడానికి మా నమ్మకం నువ్వే జగన్.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గుడ్ ఫ్రైడే రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మొదలైందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులైన వారికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. ఇంకా అర్హతలుండీ సంక్షేమ ఫలాలు అందలేదని మా దృష్టికి స్వయంగా తీసుకురావడానికి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంచి అవకాశంగా లబ్ధిదారులకు కలుగుతుందన్నారు. గత ప్రభుత్వంలోను, ఇప్పుడున్న ప్రభుత్వం పేదలకు చేస్తున్న పథకాలపై వ్యత్యాసాన్ని గుర్తించి జగనన్నకు అండగా ఉండాలనే సంకల్పంతో మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. చంద్రబాబునాయుడు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని తెలిపారు. పెడన నియోజకవర్గ పరిశీలకులు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ టి. నాగేశ్వరరావు, ఇతర నేతలు మాట్లాడారు.

20వ వార్డులో 'మా నమ్మకం జగన్' ప్రారంభం

పట్టణంలోని 20వ వార్డులో మా నమ్మకం జగన్.. మా భవిష్యత్తు జగనన్నే కార్యక్రమాన్ని 20వ వార్డులో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ యోగ క్షేమాలను అడిగి వారి ఆమోదంతో ఆ ఇంటికి స్టిక్కర్ అంటించారు. ఆయా కార్యక్రమాల్లో బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పులిగడ్డ(అవనిగడ్డ): అన్ని వర్గాల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా భవిష్యత్తు అని ప్రజలు చెబుతున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. పులిగడ్డలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని

మచిలీపట్నంటౌన్/కోనేరుసెంటర్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో శుక్రవారం నగరంలోని అన్ని డివిజన్లలో నిర్వహించారు. 41వ డివిజన్‌లో కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రారంభించారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో రూపొందించిన బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి కార్యక్రమ వివరాలను ప్రజలకు తెలిపారు. గృహ యజమానుల అనుమతితో స్టిక్కర్లను ఇంటికి, సెల్‌ఫోన్‌కు అంటించి పథకాల కరపత్రాలను అందజేశారు. డెప్యూటీ మేయర్



41వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తులో పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్ సూరిబాబు, సలార్‌దాదా

లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, కో-ఆప్షన్ సభ్యురాలు తులసి, మాజీ కౌన్సిలర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు.

ఆయన మాట్లాడుతూ నూటికి 90 శాతం కుటుంబాలకు సీఎం జగనన్న కార్యక్రమాలతో మేలు జరిగిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యే, నేతలు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ఇప్పుడు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని శుక్రవారం నుంచి ఈ నెల 20 వరకూ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి మాట్లాడుతూ మంచి జరిగితేనే ఆదరించమని ధైర్యంగా ప్రజలకు చెప్పే ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. అనంతరం పల్లెపాలెంలో ఎమ్మెల్యే సింహాద్రి, శ్రీలక్ష్మి ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి ప్రభుత్వ పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్స్‌ని తలుపునకు, ఫోన్‌లో అంటించారు. సచివాలయాల మండల కన్వీనర్ షేక్ నజీర్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ, అవనిగడ్డ సర్పంచ్‌లు దాసరి విజయకుమార్, గొరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో..

కోడూరు: కోడూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కోడూరు-1 సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు తదితరులు స్టిక్కర్లను అంటించారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మందపాకల, ఉల్లిపాలెం, విశ్వనాధపల్లి, పిట్టల్లంక, లింగారెడ్డిపాలెం సచివాలయ పరిధిలో కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, పరిసె అనసూర్య, మీసాల రాణినాంచారమ్మ, సనకా శైలజ తదితరులు పాల్గొన్నారు.

- **కోసూరువారిపాలెం(మోపిదేవి):** కోసూరువారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకురాలు శ్రీలక్ష్మి, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- **ఘంటసాల (అవనిగడ్డ):** ఘంటసాల మండలం లంకపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి, పరిశీలకురాలు లక్ష్మి, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఆసియా సిటీ సదస్సులో మేయర్ వెంకటేశ్వరమ్మ



సదస్సు వద్ద బందరు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ కవిత

మచిలీపట్నంటౌన్: దేశ రాజధాని ఢిల్లీలో మూడు రోజులుగా మారెట్ హోటల్‌లో జరుగుతున్న ఆసియా సిటీ సమ్మిట్ శుక్రవారం ముగిసింది. దీనికి మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్‌నోబుల్, కమిషనర్ జి.చంద్రయ్య హాజరయ్యారు. శుక్రవారం ప్రజారోగ్యం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పచ్చదనాన్ని కాపాడాలనే అంశాలతో పాటు కాలుష్యాన్ని నివారించే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని సదస్సులో సూచనలు చేశారని మేయర్ వెంకటేశ్వరమ్మ తెలిపారు.

అశ్వవాహనంపై వెంకన్న ఊరేగింపు

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భూ సమేత స్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు అశ్వ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై ఉన్న స్వామివారిని భక్తులు తిలకించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు ముందుభాగాన తెనాలి కళాకారుల కనక తప్పెట్లతో కాళీ నృత్య ప్రదర్శన, భీమవరానికి చెందిన కళాకారుల కేరళ వాయిద్యాలు, చిట్టి గూడూరుకు చెందిన శ్రీ రామకృష్ణా బృందం మురళీ కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో రాత్రి చిన్నాపురానికి చెందిన శ్రీ బాలసరస్వతి నాట్యమండలి ప్రదర్శించిన పోతులూరి వీరబ్రహ్మం నాటకంలోని సిద్ధుడు, ఆదంబి సీను ఏకపాత్రాభినయం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ ఈఓ ఎస్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంతెన గ్రామంలో ఖాళీ స్థలాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది ఆ ప్రాంతంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.22,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రేపు కంటి వైద్య శిబిరం

గుడ్లవల్లేరు: అంగలూరు జ్ఞానసాయి మందిరంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మి దంపతులు శుక్రవారం తెలిపారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా ఫౌండేషన్) ఆధ్వర్యంలో శంకర ఐ ఫౌండేషన్ ఈ శిబిరాన్ని దుగ్గిరాల చిన్నబ్బాయి, శ్రీమతమ్మ జ్ఞాపకార్థం చేపట్టనున్నారని పేర్కొన్నారు. నేత్ర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని నేత్ర రుగ్మతలు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పెనమలూరు: శివారు ప్రాంతాల్లో అనుమానాస్పద స్థితిలో తిరుగరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటానని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బబు అన్నారు. ఆయన శుక్రవారం తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు శివారు ప్రాతాల్లో తనిఖీలు చేశారు. ఆ ప్రాంతాల్లో సంచరిస్తున్న యువతకు కౌన్సెలింగ్ చేశారు. సీఐ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో సంచరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, కోడి పందేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ అర్జున్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారం (గుడ్‌ఫ్రైడే)ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోలగిరిలంక ఆర్‌సీఎం ప్రధాన విచారణ గురువు సురేష్ మెర్లో ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కొంతదూరం సిలువ మోశారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ శాంతియుత సమాజానికి ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. అనంతరం వెయ్యి మంది విశ్వాసులకు మజ్జిగ, శీతల పానీయాలను ఎమ్మెల్యే అందజేశారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమ, వైస్ ఎంపీపీ దిడ్ల కిరణ్ విశ్వాసులతో కలసి సిలువ మోశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పరిశీలకులు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సిలువ యాత్ర జరిగింది. ఫాదర్ జోసఫ్, మేరుగు వెంకటేశ్వరరావు, విశ్వాసులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యాన బంటుమిల్లి పుర వీధుల్లో సిలువ గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఫాదర్ ఫ్రాన్సిస్ పర్యవేక్షించారు. సిలువ మోస్తున్న ఏసును శిక్షిస్తున్న సైనిక వేషాల్లో ఉన్న పాత్రధారులు స్థానికులను ఆకట్టుకున్నారు.

కోనేరుసెంటర్: తాళ్లపాలెంలోని తరంగిణి మాత పుణ్యక్షేత్రంలో జరిగిన పరిశుద్ధ సిలువ మార్గంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గడిదేశి బాలజేసు, పెదపట్నం పంచాయతీ సలహాదారుడు గడిదేశి రాజు, అనూష తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: కోడూరులోని కృష్ణాపురం ఆర్సీఎం చర్చి వద్ద గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరిపారు. విచారణ గురువుల పర్యవేక్షణలో క్రీస్తు సిలువతో చర్చి వద్ద నుంచి కోడూరు ప్రధాన సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, మెరకగౌడపాలెం, వడ్డెరకాలనీ, నాయుడుపేట, జయపురం, హరిపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల వద్ద ప్రార్థనలు చేశారు.



పెడనలో సిలువ మార్గంలో విశ్వాసులు



కోడూరులో..



శారదానగర్‌లో ర్యాలీలో ఏసుక్రీస్తు వేషధారణలో ప్రదర్శన



అవనిగడ్డలో సిలువ మోస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బంటుమిల్లిలో సిలువ యాత్ర

కృత్తివెన్ను: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కృత్తివెన్ను ఇమ్మానియేల్ చర్చి మినిస్ట్రీస్‌లో పాస్టర్ బీవీ డానియల్‌రాజు దేవుని దివ్యోపదేశాన్ని వినిపించారు.

పెడన: తోటమూలలోని ఆర్సీఎం చర్చి వద్ద సిలువ ఘట్టాలను అనుసరిస్తూ విశ్వాసులందరూ సిలువ మార్గం(ర్యాలీ)ను ఫాదర్ రెవరండ్ అనిల్ ఫ్రాన్సిస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రేమాంజలి కాన్వెంట్ సిస్టర్స్ ఉపదేశికులు, దీక్షా పరులు, సంఘ పెద్దలు, ఉప్లా సభ్యులు, మరియ దళ సభ్యులు, విన్సెంట్‌పాల్‌సభ్యులు, యువతీయువకులు, చిన్నారి బిడ్డలు వివిధ గ్రామాల నుంచి పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో..

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని సుకర్లాబాద్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సిలువ మార్గం నిర్వహించారు. దీనిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని సిలువను మోశారు. క్రైస్తవులకు వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్ తదితరులు మజ్జిగ ను అందజేశారు. ర్యాలీలో ఫాదర్ లాం జయరాజు తో పాటు క్రిస్టియన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, క్రైస్తవులు పాల్గొన్నారు. శారదానగర్ ఆర్‌సీఎం విచారణ పరిధిలోని సాగరమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ జానీవిక్రూస్, క్రైస్తవులు పాల్గొన్నారు.

మల్కాపట్నంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తును శిలువ వేసే ఘటనను వివరిస్తూ బ్రదర్ డానియేల్ వేసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. జాన్ కెనడీ, జోబ్ జోసఫ్, అలెగ్జాండర్ వాక్యోపదేశాలు చేశారు. మల్కాపట్నం రైలుపేటలోని బేతేలు ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఖాజాలకు దుస్తులు బహూకరణ

గుడివాడ టౌన్: రంజాన్ మాసంలో మసీదుల్లో ఖురాన్ చదివే ఖాజాలకు వైఎస్సార్ సీపీ నాయకులు వస్త్రాలను బహూకరించారు. గుడివాడ నియోజకవర్గంలోని ముస్లింలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్ని వేళలా అండగా ఉంటారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్ని మసీదులలో జరిగిన ప్రార్థనలలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తారని దీక్ష విరామం అనంతరం సాయంత్రం ఇఫ్తార్‌లో భాగంగా మసీదులలో గంజి ఏర్పాటుకు ఖర్చులు ఉంటాయన్నారు. మసీదుల భక్తుల సంఖ్యను బట్టి ఆ ఖర్చులు వేరువేరుగా ఉంటాయని వాటిని పూర్తిగా ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఏర్పాటు చెయ్యాలని నిశ్చయించుకున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మసీదులలో కమిటీ వారు ఏర్పాటు చేసిన లెక్కల ప్రకారం ఖర్చుల మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, సంచార జాతుల కార్పొరేషన్ డైరక్టర్ సయ్యద్, ముస్లిం నాయకులు రహమ్‌తుల్లా బేగ్, రజక్ భాషా, కరీముల్లాబేగ్, ఖాదర్‌బేగ్, షకీర్, షమ్ము, ఆలీబేగ్, అబ్దుల్ రహీం, తదితరులు పాల్గొన్నారు.

ఏజే కళాశాల వద్ద ఆందోళన

మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్ పరిధిలో ఉన్న ఆంధ్ర జాతీయ కళాశాలలో శుక్రవారం క్రీడాకారులకు, కళాశాల సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎప్పటిలానే కళాశాల క్రీడా మైదానంలో ఆడుకునేందుకు క్రీడాకారులు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లారు. ఈ సందర్భంలో కళాశాల సిబ్బంది క్రీడాకారులను మైదానంలోకి వెళ్లవద్దంటూ నిలువరించారు. ఈ నెల 11న కళాశాలలో కార్యక్రమం ఉందని దీనికి మరమ్మతులు జరుగుతున్నాయని 12వ తేదీ వరకు మైదానంలో ఆడుకునేందుకు రావద్దంటూ హుకుం జారీ చేశారు. ఈ సందర్భంలో సిబ్బందికి, క్రీడాకారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో క్రీడాకారులు కళాశాల ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ విషయం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు తెలియడంతో కళాశాల అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్‌ను కళాశాలకు పంపి కళాశాల సిబ్బంది, క్రీడాకారులకు మధ్య సయోధ్య కుదిర్చారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

నాగాయలంక (అవనిగడ్డ): భావదేవరపల్లికి చెందిన పరిశ లక్ష్మణరావు (41) ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష మంజూరైంది. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని వైస్ ఎంపీపీ పరిశ అమ్మన్న, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ అందజేశారు. మిగిలిన బీమా క్లెయిమ్ రూ.90 వేల నగదు బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి), గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.